# ● కొత్త రచయితలు

## వెళ్ళిపోకు నేస్తమా!

—అడబాల రమేష్‌బాబు



నాన్నగారు చనిపోయి నేటికి సంవత్సరము పూర్తికావస్తూంది. ఆయన చనిపోయిన తరువాత కుటుంబ బాధ్యత నా మీదపడింది. చాలా కష్టం మీద మంత్రిగారి రికమండేషన్‌తో నాన్నగారి ఉద్యోగం నాకు వచ్చింది. ఆరు నెలలు ట్రైనింగు పూర్తయిన తరువాత తొలిసారిగా డ్యూటీలో జాయినవడానికి ఈ రోజు పోతున్నాను. విజయవాడలో సొంత ఇల్లు వుండడంతో తమ్ముడి చదువు కోసం అమ్మా, తమ్ముడూ అక్కడే వుండిపోయారు.

జీవితంలో ఎన్నో చేయాలనుకున్నాను. కానీ దానికి విరుద్ధంగా తూర్పు గోదావరి జిల్లా రాజోలు బస్సు డిపోలో నాకు ఉత్తర్వు ఆర్డర్లు వచ్చాయి. ఆ ప్రాంతానికి పోవడం అదే తొలిసారి. నిజంగా చాలా అందంగా వుంది. ప్రతిరోజూ రాజోలు నుండి సఖినేటిపల్లి బస్సులో పోతూంటేచుట్టూ కొబ్బరితోటలు, తోటల మధ్యలో కాలువ. దూరంగా కాలువ కలిసే గోదావరి. ఉదయం సమయంలో అయితే దగ్గరలో వున్న సముద్రం ఘోష వింటుంటే ఆనందం చెప్పనలవికాదు. ఆ ప్రాంతంలో అట్టే చదువుకున్నవాళ్ళు లేరు. ప్రతి ఇంటి ముందూ బస్సు ఆగవలసిందే. ఇంకా పెద్ద కుటుంబాలయితే తయారై వచ్చేంతవరకు బస్సు ఆగవలసిందే. లేకపోతే డిపో మేనేజరు దగ్గర నుండి చీవాట్లు.

డ్యూటీలో చేరి ఆరు నెలలు కావస్తూంది. జీవితం రొటీను అయిపోయింది. బస్సూ నేనూ రోజంతా తిరగవలసిందే. విజయవాడలో ఎంతో అందమైన కాలేజీ జీవితంతో పోల్చుకుంటే నిజంగా బాధ అనిపిస్తుంది. స్వతహాగా నేను మాటకారిని కావడంతో నాకు స్నేహితులు చాలా ఎక్కువగా వుండేవారు.

డ్యూటీలో చేరిన కొద్దికాలంలోనే తెలిసిపోయింది, కండక్టరును ఖాకీ డ్రస్సు వేసుకొని తోలు సంచి పట్టుకొని అరిచే వాడుగా చూస్తారుగాని మనిషిగా ఎప్పుడూ చూడరు. అసలు చాలామంది కండక్టరు మొహం చూడడం కూడా అరుదు. టిక్కెట్టు తీసుకోవడం ,సీట్లో కూర్చోవడం! వాతావరణం చాలా కొత్తగా వుంది. నేను డ్రైవరుకు ఫ్రెండును, డ్రైవరు నాకు ఫ్రెండు అంతే.

ఎప్పటిలాగానే ఆ రోజు కూడా డ్యూటీ ప్రారంభమయింది. కొబ్బరి తోటల మధ్య బస్సు దూసుకుపోతూంది. చలికాలం కావడంతో ఉదయం ట్రిప్పుకు అంతగా రద్దీ లేదు. అప్పుడప్పుడే సూర్యకిరణాలు కొబ్బరి ఆకుల మధ్య నుండి వచ్చి బస్సు అద్దాల మీద పడుతున్నాయి. సరుగుతోటల మీద మంచు ఇంకా మెరుస్తూనే వుంది. బస్సు కేశనపల్లిలో ఆగింది. ఒక అందమైన అమ్మాయి చేతిలో పుస్తకాలతో బస్సులోకి ప్రవేశించింది. బస్సు స్టార్ట్ అయింది. జీవితంలో అంత అందమైన కుందనపు బొమ్మలా వున్న అమ్మాయిని చూడటం అదే మొదటిసారి. పూర్తి తెలుగుతనం నింపుకొని, కోనసీమ అందాలతో పోటీపడే అందం. అమాయకమైన ముఖం, విశాలమైన కళ్ళు, నునుపైన బుగ్గలు, కళ్ళకి కాటుక, బంగారపు పావడా, కాళ్ళకు మెరుస్తున్న గజ్జెలు, ఎర్రని పట్టు లంగా, దానిపై అరటి బోదె రంగు ఓణీ. అయిదు నిముషాల పాటు ఈ ప్రపంచాన్ని మరచిపోయాను. బస్సు కుదుపుతో ఈ లోకంలోకి వచ్చాను. వెంటనే సర్దుకొని నాకు కుడిప్రక్క సీట్లో కూర్చున్న ఆమెను "టికెట్" అని అడిగాను. "పాస్" అని హేండ్ బ్యాగ్‌లో నుంచి తీసి ఇచ్చింది. మరోసారి ఆశ్చర్యానికి లోనైనాను.

డ్యూటీలో చేరిన ఆరు' నెలల్లో పాస్ అన్న పదం వినడం అదే మొదటిసారి. పాస్ తీసుకొని చూశాను. పేరు ప్రవల్లిక. బి.ఎ. ఫస్ట్ ఇయర్ చదువుతూంది. పాస్ ఇచ్చేసి తరువాత స్టేజి రావడంతో టిక్కెట్లు ఇవ్వడంలో నిమగ్నమయినాను. మధ్య మధ్యలో ఆమెను

చూస్తూనే వున్నాను. ఆమె కూడా అందరిలాంటిదే. ఒక్కసారి కూడా నా వైపు తిరిగి చూడలేదు. చలికి ముదుచుకుని కిటికీ గుండా బయటికి చూస్తూంది. ముఖం మీద సూర్యకిరణాలు పడి మరీ అందంగా కనిపిస్తూంది. నునుపైన బుగ్గల మీద ఆమె ముంగురులు నాట్యమాడుతున్నాయి. చాలా కలవారి కుటుంబం నుండి వచ్చినట్లు కనిపిస్తూంది. కానీ ఆ ప్రాంతంలో ఒక అమ్మాయి కాలేజీకి వెళ్ళడం మొదటిసారిగా అదే చూడడం! చాలా ఆనందం వేసింది. రాజోలు రావడంతో ఆమె దిగిపోయింది. బాధ వేసింది. బస్సు అంతా ఖాళీ అయిపోయిన తరువాత డబ్బు లెక్కపెట్టుకొని దిగిపోతుంటే ఆమె సీట్లో గులాబి కనిపించింది. ఆమె జడలో నుండి పడిపోయిన బాధతో వాడిపోయినట్లయింది. గులాబీని ముట్టుకొని విసిరేయడం ఇష్టంలేక బస్సు ముందు పెట్టాను.

ఆ రోజు నుండి ఉదయం కోసం ఎదురుచూడటం అలవాటైపోయింది. సూర్యోదయం కోసం కాదు, ఆమె కోసం. డ్యూటీ అంటేనే చిరాకుపడే నాకు డ్యూటీ ఎంతో ఇష్టం అయిపోయింది. ఆమె రాకతో బస్సులో కాంతి! నాలో ఉత్తేజం! అంతా వింతలోకంలో ఉన్నట్లు వుండేది. ముందు స్టేజీలో ఎక్కే ఆడవాళ్లను ముందు సీట్లలోనే కూర్చోబెట్టి ప్రక్కనున్న సీటు ఖాళీగా వుంచేవాణ్ణి ఆమె కోసమే. స్వతహాగా నేను మాటకారిని కావడంతో బస్సులో రకరకాల జోకులు ప్రయాణీకులతో వేసేవాణ్ణి. కొన్ని పేలేవి. ఆమె నవ్వేది. అందంగా, సుతారంగా నవ్వేది. బస్సే ఆనందంగా పరుగెత్తేది. అప్పుడప్పుడు చూసేది. అప్పుడు చూడాలంటే నాకు భయం వేసేది.

ఒక రోజు బస్సంతా ఖాళీ అయిపోయిన తరువాత ఆమె సీట్లో పుస్తకం కనిపించింది. ఆమె మరచిపోయినట్లుంది. పుస్తకం మీద ఆమె పేరు ఇంగ్లీషులో వ్రాసి వుంది. వ్రాత అంత బాగా లేదు. తరువాతి రోజు ఇద్దామనుకొన్నాను. కాని ఆరోగ్యం బాగుండకపోవడంతో డ్యూటీకి వెళ్ళలేకపోయాను. సాయంత్రం కాలేజీ అయిపోయిం తరువాత ఆమె బస్టాండుకు వచ్చి బస్సెక్కుతూంది. అందుకని నీటుగా తయారై బస్టాండుకు చేరుకొన్నాను. నేనూహించినట్లే ఆమె వేచి చూస్తూంది. ధైర్యంగా ఆమె దగ్గరికి వెళ్ళి "సారీ అండీ. ఉదయం ఇవ్వలేకపోయాను మీ పుస్తకం" అని ఇచ్చేశాను. "థ్యాక్సండీ" అంది. కాలేజీలో అంతసేపు వున్నా ఆమె ముఖంలో అలసట కనిపించలేదు. బస్సు రావడానికి ఇంకా టైము వుండటంతో ఆమె వివరాలు అడిగాను. ఆమె ఇంటర్ విజయవాడలో చదివిందని చెప్పడంతో నేను నా గురించి, విజయవాడ గురించి చాలాసేపు మాట్లాడుకొన్నాము. ఆమె నాన్నగారు డాక్టర్ ఒక్కరే కొడుకు కావడంతో తాతయ్య, నానమ్మలకు తోడుగా ఆమె ఇక్కడికి వచ్చింది. ఇక్కడి పద్ధతులు, పరిస్థితులు ఆమెకు ఇంతకు ముందే అలవాటు ఉందట. కాని ఒంటరిగా వుండటం వల్ల బోర్ అనిపిస్తుందట. ఆ రోజు నుండి ఆమెకు మంచి మంచి నవలలు ఇచ్చేవాడిని. బస్సు డిపోలో వివరాలు, ప్రయాణంలో జరిగే పదనిసలు, పండుగలు, పచ్చళ్ళు, ప్రపంచ పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు అన్నీ సాయంత్రంపూట మాట్లాడుకొనేవాళ్ళం. ఆమె సిటీ నుంచి రావడం వలన చాలా ఫ్రీగా మాట్లాడేది. బస్సులో ఆమే, నేనూ ప్రపంచ యాత్రకు పోవాలనిపించేది. టిక్కెట్లు కూడా సరిగా ఇచ్చేవాడిని కాను. ఆమెతో జీవితాంతం కబుర్లు చెబుతూ వుండాలనిపించేది. నిస్సారంగా సాగిపోతున్న జీవితంలో రంగులు నింపిన దేవత. ఆమెను చూడకుండా వుండలేని స్థితికి వచ్చాను. ఆదివారాలు కూడా కాలేజీ పెట్టాలని నిరాహారదీక్ష చేద్దామనుకొన్నాను. ఆదివారం బస్సు అంతా నిస్తేజంగా వుండేది.

ఒక రోజు ఆమెకిచ్చిన నవల మొదటి పేజీలో ధైర్యంగా ఈ విధంగా వ్రాశాను.

"మా డిపో మేనేజరుకు స్వీట్లంటే ఇష్టం, మా డ్రైవరుకు చిరంజీవి సినిమాలంటే ఇష్టం, నాకు నీతో మాట్లాడటం ఇష్టం"

ఆమె దాన్ని చూసి నవ్వింది. ఆమెకు కూడా నాతో మాట్లాడటం ఆనందంగా వుంటుందట. తరువాతి రోజు ఇచ్చిన నవల మీద ఈ విధంగా వ్రాసాను.

"సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు
భూమి గుండ్రంగా ఉంటుంది
నీవు అందంగా మాట్లాడతావు,
నవ్వుతావు"

దాన్ని చూసి నవ్వింది కాని ఈసారి కొంచెం సిగ్గు బుగ్గల మీద కనిపించింది. చాలా ఆనందం వేసింది. ప్రేమించడం కండక్టరు కూడా చేయగలడు అనే నమ్మకం వచ్చింది. చాలా ధైర్యం కూడా వచ్చింది. తరువాత రోజు ఇచ్చే నవల మీద ఈ విధంగా వ్రాసాను.

"అందంగా నవ్వే అమ్మాయి
"సుహాసిని"
అందంగా మాట్లాడే అమ్మాయి
"సుభాషిణి"
అందమైన వ్యక్తిత్వం గల అమ్మాయి
"సుగుణ"
ఇవన్నీ ఉండే అమ్మాయి "ప్రవల్లిక"
ప్రవల్లికను నేను ప్రేమిస్తున్నాను.
ఇష్టం అయితే బస్సు సాక్షిగా
జీవితాంతం కలిసి వుంటాను"

సూర్యోదయం కోసం ఎదురు చూస్తున్నాను. ఆ రాత్రి చాలా భారంగా గడిచింది. ఆమె వెంటనే ఈ విషయం చదివితే పరిస్థితులు ఎలా ఉంటాయో అని భయం వేసింది. అందుకే దానిని అందంగా ప్యాక్ చేసి పెట్టాను. ఉదయం బస్సు స్టార్టు అయింది. గుండె వేగంగా కొట్టుకొంటూంద. స్టేజి రానే వచ్చింది. ఆ రోజు మరీ అందంగా కనిపించింది. చాలా గంభీరంగా వుంది. నేను "గుడ్‌మార్నింగ్" చెప్పాను. ఆమె చేతిలో ఏదో బహుమతి వుంది. రష్ ఎక్కువగా వుండటంతో టిక్కెట్లు ఇవ్వడంలో నిమగ్నమయినాను. ఇంతలో రాజోలు వచ్చింది. ఆమె దిగిపోతూ ఆమె చేతిలోని "గిఫ్ట్" నాకు ఇచ్చింది. నేను కూడా నా నవల భయంగా అందించాను. ఆమె అక్కడ నుండి వెళ్ళిపోయిన తరువాత బస్సులో కూర్చుని ఆత్రంగా ఆమె ఇచ్చిన ప్యాక్ విప్పాను. దానిలో ఒక లెటరు మాత్రం వుంది. ఆదుర్దాగా చదవటం ప్రారంభించాను.

కిరణ్ గారికి,

నమస్కారం. మీరు చాలా మంచివారు. మీ వంటి ఫ్రెండు దొరకడం నిజంగా నా అదృష్టం. ఇటువంటి స్నేహితులు దొరకడం చాలా అరుదు. నేను మీ మనసులో మాటను గుర్తించలేనంత అమాయకురాలిని కాదు. మీరు ఈ రోజు ఇవ్వబోయే నవలలో అదే వ్రాస్తారని నాకు తెలుసు. కాని మీరు వ్యక్తపరచడం కొంచెం ఆలస్యం అయింది. అయినా ఏమీ చేయలేము. నేను సంప్రదాయాలలో కూరుకుపోయిన ఒక ఆడపిల్లని. ఎవరినీ ఎదిరించలేను. మా తాతగారు అంటే నాకు గౌరవం, భయం. నాకు పెళ్ళి చూపులు జరిగాయి. తాంబూలాలు కూడా తీసుకున్నారు. పెళ్ళికొడుకు అమెరికాలో ఇంజనీరు. నేను అంత సరిగా చూడలేదు. పెళ్ళి వచ్చే ఆదివారంనాడు. ఒక గొప్ప స్నేహితుణ్ణి పొందినందుకు తృప్తిగా వుంది. ఇంకా నా బాధను వ్యక్తపరచడానికి భాష రావడం లేదు. ఇదేనేమో మూగరోదన అంటే. జీవితంలో ఇంక బస్సు ఎక్కను. ఎక్కితే నీవే గుర్తుకు వస్తావు.

—ఇట్లు
ఎప్పటికీ నీ స్నేహితురాలు

అంతా చీకటి. గుండెలు పగిలేలా ఏడ్చాను ఆ రాత్రంతా. వారం రోజులు సెలవు పెట్టి విజయవాడ వెళ్ళిపోయాను. తిరిగి వచ్చిన తర్వాత మళ్ళీ నా బస్సు ప్రయాణం ప్రారంభమయింది. అదే ఖాకీ డ్రస్సు! అదే తోలు సంచి! అవే కొబ్బరి తోటల మధ్య...!

●